స్త్రీణాంచ చిత్తం

డా॥ టి. ఆర్. శేషాద్రి



వైజాగ్ ఏర్‌పోర్ట్‌లో దిగినప్పట్నుంచీ అంతకి ముందు మా ఆవిడ ఫోన్‌లో చెప్పిన భోగట్టాలే తప్ప మరోటి ఏదీ కదలాడలేదు నా మస్తిష్కంలో.

"పాప పెళ్ళి సంగతి తేల్చుకుని మరీ వెళ్ళిపోవాలి మనం, స్టేట్స్‌కి!" అని ఆవిడ మాటల సారాంశం.

"మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్" — అంటారు మీరు.

"అమెరికా, ఇంగ్లాండూ, ఫ్రాన్సూ, వెస్ట్ జెర్మనీ — ఇవన్నీ కూడా సైన్సులోనూ, ధనంలోనూ, సౌఖ్యాల్లోనూ భూలోక స్వర్గాలైతే కావచ్చుగానీ పెళ్ళిళ్ళ విషయంలో కాదు సుమండీ...

"చూస్తూనే ఉన్నారుగా, అక్కడ జరిగే పెళ్ళిళ్లూ ఆ సౌభాగ్యాలూ! మఖలో పుట్టి పుబ్బలో మాడిపోడం అంటారే—

"అంచేత పాపకి — అదే; మన శుభకి ఇక్కడి సంబంధమే చూసి ఇక్కడే పెళ్లి చేసేద్దాం అని నాకు అనిపిస్తోంది సుమండీ...

"మనం చూసే పిల్లాడు ఉత్తర్రా అమెరికా ఒచ్చేసినా పరవాలేదుగానండీ, ఇప్పుడు మాత్రం ఇక్కడున్నవాడే అవాలి; ఏమంటారు?"

ఇలా నడిచింది; ఆ లెక్చరు.

టెలిఫోన్ అనేది ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకోడానికి ఏర్పడ్డ సాధనమే కావచ్చు. కానీ, మా ఆవిడ టెలిఫోన్ చేస్తే అందులో నేను మాట్లాడవలసింది ఏమీ వుండదు. అంతా వన్ — వే — ట్రాఫిక్‌గానే కొనసాగుతుంది.

లగేజి రావడడం, అది కారు డిక్కీలోకి చేరడం లాంటి వన్లు పిల్లల పెళ్లిసంబంధాల గురించీ, డబ్బు గురించీ ఈ పూట భోజనం దగ్గర 'మెనూ' గురించీ మాట్లాడుకోనివ్వవు గనక సరిపోయింది. కాని, కారు స్టార్టయ్యేక ఆవిడ వాగ్ధోరణి ఆపడం నా వశమా?

"మీకేం పోయింది; నింపాదిగా మాదాం అంటూ ఇన్నాళ్లూ పిల్ల పెళ్ళి సంగతి పట్టించుకున్నారు కాదు. సాటివాళ్ళ దగ్గర్నించీ బంధువుల దాకా అందరూ అడగడమే — ఏమే రత్నం, అమెరికా వెళ్లిపోతున్నారు కదా; పిల్ల పెళ్లి అక్కడే చేస్తారుటే — అని ఒకళ్లూ; అమెరికాలో పెళ్ళిచేస్తే అమెరికా అబ్బాయికే ఇచ్చి చేస్తారుగాబోలని మరొకళ్లూ; — ఇలా ఎవళ్ళకి తోచినట్టు వాళ్లు అనేస్తూంటే నే నూరుకోలేకపోయేమ సుమండీ!

"ఈ ఆరు నెలల్లోనూ మొత్తం నలుగురు పెళ్లికొడుకుల్ని చూశానుసుమండీ. చూడ్డమేమిటి; దానిక్కూడా చూపించేను; మీరేమంటే అనండిగానీ—! అందరూ తెలుగువాళ్లూ మనవాళ్లూనూ. మీరేమో కులం వేరయితే ఏం నష్టం; శాఖాభేదం వుంటే ఏమిటి తప్ప అంటారుగాని మనవాళ్లలో మన శాఖలో మనమ్మాయికి సరిపోయే సంబంధం దొరికితీరుతుందనే నా నమ్మకం సుమండీ!

"అందులోనూ చివరిసారిగా కిందటి శనివారంనాడు చూసిన అబ్బాయైతే నాకూ మన శుభకీ కూడా బాగా నచ్చేడు. ఐ.ఐ.టీ.లో ఎమ్. టెక్ చేస్తూ ఐ.ఎ.ఎస్.కి సెలక్టయ్యాడా అబ్బాయి. తల్లికి ఒక్కడే కొడుకూ; తండ్రెప్పుడో చిన్నప్పుడే పోయేరుట. మనం ఏ మాత్రం ఆలోచిస్తూ తాత్సారం చేసినా ఎవరో ఒకరు తన్నుకుపోతారు సుమండీ! అందుకే మీరు పైనెల్లో వస్తానంటున్నా వెంటనే బైల్దేరమని చెప్పేసేను. ఆ !"

ఏదో ట్రాఫిక్ జంక్షన్ దగ్గిర ఎర్రలైటు వెలిగినప్పుడు ఆగిన కారు లాగ అక్కడ ఆగింది మా ఆవిడ వివరణ.

"రేపో ఎల్లుండో నేను కూడా చూస్తాన్లే. పదిహేను రోజులు టైమ్ వుంది కదా" అని నేను అనగానే మళ్ళా ట్రాఫిక్ జంక్షన్ దగ్గిర పచ్చలైటు వెలిగినట్టయింది — మా ఆవిడ మాట "కారు" తనానికి—

"స్పరి-పోయింది!" రేపో, ఎల్లుండో — నటా? ఇవాళల్లా ఏమిటి చేస్తారుటా? ఇప్పుడింకా టైం పన్నెండయినా కాలేదూ. ఎంత మీరు భోజనానికనీ, తెష్టనీ కాలయాపన చేసేసినా సాయంకాలం నాలుగు తరవాత ఏమిటి, పాటు? ఆ మాత్రం దానికి ఫ్లయిట్‌లో ఆఘమేఘాల మీద రావడమెందుకూ; ఏ పేసింజర్ షిప్పో ఎక్కి నెల రోజుల నాటికి రావలిసింది గాబోలు?"

"అయితే ఏమిటి; నువ్వనేది?"

"ఇవాళ విదియా, బుధవారం! సాయంకాలం అయిదూ ఆరు గంటలప్పుడు మనిద్దరం వాళ్ళింటికొస్తున్నాం అని కబురు పెట్టేను సుమండీ!"

"ఆ అబ్బాయిని నేను చూడ్డానికే ముహూర్తం పెట్టేవా; ఇంక దేనికైనా కూడా ముహూర్తాలు పెట్టేసేవా?"

"వాల్చాల్లెండి; మాటలు నేర్చేరెలా అయితేనేమి!"

"వాళ్ళు కూడా పాతికేళ్లనించీ ఈ విశాఖపట్నంలోనే వుంటున్నారుట; మనలాగేనూ. ఆవిడ బాగా చదువుకున్న మనిషే. పుట్టింటివారి తరఫునించి ఓ ఇల్లూ అత్తవారి తరఫునించి మరోటీ వొచ్చేయట. అయితే నేమీ; పాపం ఎన్నాళ్లో కాపరం చేసినట్టులేదు; ఓ ఏడాదీ రెండేళ్లు చేసినట్టున్నారు; ఆయన పోయేరుట. ఎన్నాళ్లయిందని మొహమాటంగా అడిగితేనూ; "వీడు చంటిపిల్లాడప్పుడు" అని చెప్పి వూరుకుంది. సరే శుభమా అంటూ పెళ్ళి మాటలకి వెళ్లి ఆ వివరాలన్నీ అడగడం ఎందుకని నేనూ వూరుకున్నాను సుమండీ!

"ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటేనూ, మన పిల్లని ఆ అబ్బాయి చేసుకుంటే సుఖపడేదీ బావుండేదీ మన పిల్లే అని నాకనిపించింది సుమండీ. అబ్బాయి ట్రెయినింగయిపోగానే అసిస్టెంటు కలెక్టర్‌గా పోస్టింగు వస్తుందిట. ఏడాదిలో జాయింటు కలెక్టరు; మూడు నాలుగేళ్ళలో జిల్లా కలెక్టరూ అయిపోతాడు. బంగళా, కారూ, నౌకర్లూ అధికారాలూ వస్తాయి. అత్తగారంటూ వున్నప్పటికీనూ బాగా చదువుకున్నవిడానూ; మొదట్నించీ సిరిగలారి బిడ్డానూ గనక ఆతళ్లూ అవీ వుండవ్. మొగపిల్లాడి తల్లి కనకా మాట కొంచెం బెట్టుసరిగా వుందిగానీ ఆ బంగారమ్మగారు నిజంగా బంగారమ్మే సుమండీ అన్నారు మనకీ సమ్బంధం సంగతి చెప్పిన కామేశంగారు!"

"బంగారమ్మా?"

"ఆ ; అదే, ఆవిడ పేరు. పాతకాలపు పేరే అనుకోండి — అయినా ఆవిడ పేరు చూసి అబ్బాయికి పిల్లనిస్తామటండీ; మీరు మరీనూ!... కానీ ఏ మాట కామాటే చెప్పుకోవాలి సుమండీ; నలభయ్యయిదేళ్ళ వయస్సులో కూడా ఆవిడ పేరుకి తగ్గట్టు మేలిం బంగారపు ఛాయలో వుండడమేకాకానూ ఆ పిల్లాడికి అక్కగార్లా వుందిగాని తల్లిలాగ లేనే లేదసలూ!

కాలంనాడు మొగుడు పోయిందగ్గర్నించీ కాలు కిందపెట్టక్కర్లేని సంపదలో పురుళ్లూ, చాకిరీలూ లేకుండా వుండబట్టి; ఆ నునుపంతానూ. లేకపోతే నాలాగే వడిలిపోయి వాడిపోయేదేనేమో!..."

నాకేమీ వినిపించడం లేదు; ఏర్‌పోర్టుకి చాలా దూరంగా వున్న టౌన్‌లో ప్రవేశించిన కారుకి తనకి ఈ వేపూ ఆ వేపూ పరుగుపెట్టే వాహనాల హోర్నల ధ్వనిలో తన చప్పుడు వినపడనట్టు... ...

* * *

బంగారమ్మ. అరుదైన పేరు. అరుదైన మనిషి. అరుదైన మనసు. అరుదైన నిబ్బరం. షిప్‌యార్డులో చిన్న ఇంజినీరుగా ప్రవేశించిన నా ప్రాదుర్భూత యవన దశ. బి.ఎన్. శర్మ గార్డెన్స్‌కి కొంచెం అటుగా శొంఠివారి మేడ మీద గది. ఆ కిటికీలోంచి కళ్లకి దూరమైనా మనసుకి దగ్గిరిగా కనిపిస్తూ వుండే విమెన్స్ హాస్టల్ మొదటి అంతస్తు చివరి గది కిటికీ. ఆ కిటికీలో కూచుని పాసింగ్ షో గమనించుకుంటూ పాతలు అవలోకనం చేసుకునే పొడగరి అందగత్తె. ఎవరో స్మగ్లర్ అంటగట్టిన జపాన్ బైనాక్యులర్స్ విస్పష్టంగా కనబర్చిన జరీ అంచు తెల్లచీర. పని లేకపోయినా ఆది వారాలు యూనివర్సిటీ లైబ్రరీ లాన్స్‌లో నిలువుజీతం. అయిదో ఆదివారం ఐదవ తనంలా కనికరించిన ఒంటరి బంగారం. కొరుకుడుపడని ప్రొఫెసర్ ఆదినారాయణ మూర్తి ఆశయాభిలాషతో నా చుట్టూ అల్లుకున్న పసుపు పచ్చని క్రేపర్ బంగారమ్మ. దయసు బంగారం. ఆశయం బంగారం. అభిలాష బంగారం. అనుభవం బంగారం..." అర్జంటుగా ఓసారి ఇంటికి వొచ్చి వెళ్ళు" అని అమ్మ ఇచ్చిన టెలిగ్రాం చూసి రాగి కలిపినప్పట్లా ఎరుపెక్కిన బంగారం. "తప్పమ్మా; రత్నం గొప్పదే కావచ్చుగాని బంగారం అలంకారానికి సిద్ధి" అని చెప్పబోతే అమ్మ కళ్ళలో అంగారం. గారం అనే వెలిగారం లేక కరిగించినా కాంతి తెచ్చుకోలేకపోయిన బంగారం. కొలిమిలో పడి విలువ చెలిమికి నుసి పులిమిన ముద్ద బంగారం.

"ఆ పిల్ల నీ కన్నా బెత్తెడంత పొడుగు; ఎప్పుడూ చూసుకొనే లేదుట్రా?"

"కులహీనమైనా పరవాలేదుగాని వరహీనం జయం కాదు శేషూ."

"వాళ్ళింట్లో యేడు తరాల్నించీ ఒక్కటే బిడ్డట; వినలేదుట్రా?"

"తల్లీతండ్రీ లేకపోయినా లంకంత ఇల్లు వదిలేసి హాస్టల్లో చేరిన తెగువరి పిల్లని చేసుకుంటానంటావేంరా చిన్నా?"

"చదువుకున్న పిల్ల అన్నెప్పి మోజుపడు తున్నావుగానీ రత్నం మాత్రం ఎమ్మే చదువుకుంది కదురా?"

ఏ మాటలూ నా మీద పనిచెయ్యలేదు. కానీ, చివరికి అవధాన్లుగార్ని ఎదుట పెట్టుకుని "ఆ పిల్ల జాతకంలో పెళ్ళయిన మూడో ఏట మొగుడు పోతాడని ఉందిట్రా తండ్రీ! నా కడుపులో చిచ్చుపెట్టి వెళిపోదామని చూస్తున్నావా నా తండ్రీ?" అని అమ్మ శోకాలు పెడితే ఏం చెయ్యాలి?"

బంగారం మెత్తనిదని... కరిగిపోతుందని... అరిగిపోతుందని...

రత్నం గట్టిదని... కరగదని... అరగదని...

గ్రహించక తప్పలేదు... పరిగ్రహించక తప్పలేదు...

* * *

"రండి, రండి!"

"మీవారా?"

"అనుకున్నట్టుగా ఇవాళే వచ్చేశారా, అమెరికా నుంచి?—

"కూర్చోండి —

"ప్రయాణం బాగా జరిగిరేదిటా?—

"అదృష్టమంతా మా అబ్బాయిదే, ఇంక. అమెరికా నుంచి ఏం కావాలన్నా మర్నాటికల్లా ఇంట్లో వొచ్చిపడతాయన్నమాటే—

"అబ్బాయిని అర్జెంటుగా క్యాంపుకి రమ్మని తీసికెళ్ళేరు కలెక్టర్‌గారు— ట్రెయినింగులో బాగా చురుకుతనం చూపించేడని కలెక్టర్‌గారు రిపోర్టు పంపేరుట. ఎల్లుండి బయల్దేరి హైదరాబాదు వెళ్లాలిట. పోస్టింగా? ఈ వూరి సంగతి అలా వుంచి ఈ ప్రాంతంలోనే ఇవ్వరుట. ఇక్కడ పుట్టి పెరగడం అదే ఇబ్బందొచ్చి పడ్డాది.

"ఈ పాతకాలపు ఇళ్లు మనకెందుకమ్మా; బేరం పెట్టి అమ్మేసెయ్యి అంటూ గొడవ ప్రారంభించేడు నాలుగు రోజుల్నించీనూ. వాడన్నదీ రైటులాగే వుంది. ఎక్కడికెళ్తే అక్కడ క్వార్టర్స్, బంగాళాలు ఇస్తారు. ఈ ఇళ్ళు ఎవరికో వొప్పచెప్పడం, వాళ్లు తిన్నగా వుండకపోతే తగూలూ, తంటాలూ; పరిచయాలూ, మొహమాటాలూ — కొత్తతరం వాళ్ళ ఆలోచన్లే వేరు. మనమే సర్దుకోవాలి. ఉన్నది ఒక్కగా నొక్కడు! వాడి ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకోడం దాకా ఎందుకు; మాట్లాడ్డమే మంచిది కాబట్టి నాకూ ఇప్పుడిప్పుడే అనిపిస్తున్నాది. కాఫీ తాగుతారా; టీ ఇమ్మంటారా?

"అదేం మాట? వాడు ఎంత పెద్ద హోదాలో వున్నా కన్నతల్లీ వున్నవూరూ ఇదీ! ఇక్కడికి రాకుండా ఎలా వుంటాం? ఒక్కేమటుకూ ఉండడానికి మీ ఇల్లు తేదుటండీ? అలా దశకానికో పుష్కరానికో ఒచ్చినప్పుడుంటాం కదా అని ఇక్కడో ఇల్లుంచుకోడం దండుగ కాదుటండీ?

"ఉంటానండీ, అబ్బాయి రేపు మధ్యాన్నం ఏదోవేళకి ఇంటికొస్తాడనుకుంటాను. మీరూ అమ్మాయీ వాణ్ణి చూసే వున్నారు గనకా వాణ్ణి రేపు సాయంకాలం పూట ఓసారి ఇటు ఏదైనా పనుంటే రమ్మని చెప్పండి. ఇంటి దగ్గిర పని ఒత్తిడి ఆట్టే లేకపోతే మీరూ, అమ్మాయీ కూడా రావచ్చునుకోండి. సమ్బంధం కలుపుకుందామనుకున్నాక ఒకటికి రెండు మాట్లు పలకరించుకోడం మంచిదే కదుటండీ!

"డ్రయివర్ని తీసుకురాలేదా? అయినా వారున్నారు; అన్ని విద్యలూ తెలిసినవారు. ఉంటాను; నమస్కారం!"

* * *

"చూసేరా?"

"చూడ్డానికి ఆ అబ్బాయి లేడు కదా!"

"అబ్బబ్బ; అది కాదండీ, నేనన్నది! ఆవిడ — ఆవిడ మాట తీరు; ఆ కల్చర్; ఆ కలుపుగోలుతనం! ఇంకా సమ్బంధం ఖాయపర్చుకోనేలేదు — మనతో ఎంత ఇదిగా వాళ్ళ నిర్ణయాలూ అవీ చెప్పింది!"

"అవును, నిజమే."

"మరి మీరేంటంటారు? అబ్బాయిని మీరు చూళ్లేదనుకోండి. ఐనా పాప చూసింది; నేనూ చూసేను. పాపకి ఆ అబ్బాయి నచ్చేక ఇంక మీకూ, నాకూ నచ్చవలిసింది వాళ్ళ స్తోమతే గాని, మరోటేదీ కాదు సుమండీ!"

"అవును, నిజమే."

"అబ్బబ్బా, ఏంటండీ, ఆ పొడి పొడి సమాధానాలు? అవును, నిజమే; అవును, నిజమే — అనుకుంటూనూ!"

"అదికాదు రత్నా; నేను ట్రాఫిక్ చూసుకోవాలి కదా."

"ఓయబ్బ, గొప్ప ట్రాఫిక్కు. తప్పకోండి, నేను డ్రయివు చేస్తాను!"

"ఈ కారునీ, నన్నూ నువ్వు డ్రయివు చెయ్యలేవని కాదు."

"అదుగో. నేనిలా అంటే మీరు అలా అంటారు. ఇంజినీరు కవి అయితే ఇంజను సంగీతం వాయిస్తుంది, జాగర్త!"

"నువ్వు నవ్వినా సరే, నేనే డ్రయివు చేస్తాను."

"గొప్ప చేశాల్లెండి. ఇంటిదాకా వొచ్చేక ఇప్పుడు చూడు నా డ్రయివింగు, అన్నాట్ట మీలాంటి వాడే ఎవడోను."

"ఇంటికొచ్చేక కూడా కారుని తిన్నగా షెడ్‌లో పెట్టడానికి కూడా డ్రయివింగు బాగా తెలియాలేమో ఆలోచించు."

"నేనలా ఏమీ ఆలోచించను సుమండీ. మాట వరసకి మన గేటు నుంచి మన కారు షెడ్డు పల్లంలో వుంది. ఆలోచన్లూ, ఇంజినూ ఆఫ్ చేసి న్యూట్రల్లో పెట్టుకుంటే చాలు; కారు షెడ్లోకెళ్ళి కథ సుఖంగా, శుభంగా ముగుస్తుంది."

* * *

నేనిప్పుడు చేస్తున్నది అదే.

ఆలోచనలూ ఇంజనూ ఆఫ్ చేశాను.

మనస్సుని న్యూట్రల్‌లో పెట్టాను.

కానీ, ఒక్కణ్ణే వచ్చానే —

బంగారం నిన్నట్లా న్యూట్రల్‌లో వుంటుందా?

విరుచుకుపడదా?

కారు రోడ్డుకి ఎడం వేపున ఆపి; తలుపులు బిగించి తాళం పెట్టి ఆ ఇంటి ముంగిటికి వచ్చాను.

గేటు మీద వున్న హుక్కు తప్పించి లోపలికి అడుగుపెట్టాను.

సిమెంటు చపటా మీద అందంగా పల్చగా నెరిపిన మెత్తటి ఇసుక...

తలుపుకి పెద్ద తాళం కప్ప...

ఇసుకలో సన్నటి అక్షరాలు...

"శేషూ!

ఏ మొహం పెట్టుకుని చేస్తాం, ఈ పెళ్ళి?

వెళ్ళేటప్పుడు, లెటర్ బాక్సులో మీ అమ్మాయి జాతకం వుంది; తీసుకెళ్ళు.

అప్పుడూ, ఇప్పుడూ నీకు అదే తరుణోపాయం."

* * *

"స్త్రీణాంచ చిత్తం, పురుషస్య భాగ్యం; దేవోనజానాతి; కుతోమనుష్యః" అని స్మరణకు తెచ్చుకుంటూ; జాతకం రాసి వున్న ఆ దశసరి కాగితంతో ఆ ఇసుకలో వున్న అక్షరాలను అలికేశాను.

డాబా మీద ఆరవేసిన చీర వెనుక ఒక బంగారు మనసు లీలగా కదిలిన ఊహ.

*